# పుల్లమజ్జిగ

రచన: "రాజు"




ఆవేళ కార్తీక సోమవారం.

ఉదయం పదిగంటలు. ఆఫీసుకు శెలవగుటచే మార్కెట్టుకు వెళ్లి సామాన్లు కొనుక్కొని, వీధిగేటు తెరచుకొని ఇంట్లోకి ప్రవేశిస్తున్న శర్మకు లోపల నుండి గట్టిగా మాటలు వినిపించాయి. "అప్పుడే మొదలయిందిరా భగవంతుడా! అనుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టేడు.

"ఇన్నాళ్ళనుండీ పనిచేస్తున్నావు, యింకా నీకు అంట్లు సరిగ్గా తోమటం చేతకాలేదేమిటే! అయ్యో నా ఖర్మ కాలిపోనూ, యెన్నిపర్యాయాలు చెప్పేదే నీకు ఆ పెరుగ్గిన్నె సరిగ్గా తోమమని...అస లింతకీ నిన్ననవలసిన పని కాదిది, దాన్ననాలి. ఒసేవ్, ఏమే కోడలుపిల్లా......చూశావా - చూశావా దానికెంత నిర్లక్ష్యమో ... యెన్నిసార్లు పిలవాలి? అత్తగారు "వూఁ" అంటే, ఏమికావాలత్తయ్యో అంటూ పరుగెత్తుకురావాలి గానీ అంటూ బామ్మగారు సోదె లంకించుకున్నారు.

"ఏమిటమ్మా, ఏమయిందీ? అసలు సంగతేమిటో చెప్పరాదూ? యెందుకీ అని అప్పుడే లోపలకు వస్తూన్న శర్మ విసుక్కొంటూ అడిగాడు

"చూశావటరా శర్మా! ఈవేళ కార్తీక సోమవారం, యేదో పర్వదినం కాబట్టి మామూల్లా కాకుండా రేపటకి ప్రత్యేకంగా పెరుగును తోడపెట్టమ్మా అని నిన్న చెప్తేనూ......యెలాచేసిందనుకున్నావుశా, మజ్జిగంతా పుల్లగా అయిపోయింది. నాలికమీద వేసుకుంటే నరాలు జువ్వుమంటున్నాయి...నా కీ పెరుగక్కర్లేదు. మార్కెట్టుకెళ్లి పెరుగు పట్రాకపోతే నేను భోంచేయే భోంచేయను" అంటూండగానే వంటింట్లోంచి సుశీల బయటకువచ్చి,

"నే నసలు పెరుగు నెక్కువగా తోడుపెట్టలేదండీ పుల్లగా వుండటానికి, అత్తయ్యగా రూరికేనే కోపగించుకుంటున్నారు..." అన్నది.

"ఆ, ఆఁ యేవిటీ నే నూరికేనే కోపగించుకొంటున్నానా? నువ్వు కాకపోతే మరెవరే పెరుగు తోడుపెట్టేరు? యిలా కూరల్లోనూ, పచ్చళ్లలోనూ వుప్పూ పప్పూ ఎక్కువవేసీ, తక్కువవేసీ నన్నేడిపించటమెందుకూ. నే నీ యింట్లో వుండటం యిష్టం లేకపోతే నోటితో చెప్పెయ్యరాదూ పామ్మని..." అంటూ కూనిరాగాలు తీయసాగింది.

"మరీ మంచిది, మేంకూడా సుఖంగా వుంటాం" అంది సుశీల, అనటమే గాని యెక్కడికీ పోదని.

"నోర్ముయ్, ఏదో అన్నదని పెద్దదానిమాట ల్నలా తిరస్కరించటమే. యేమిటామాటలు సుశీ..."

"అలా అడగరా నాయనా, బుద్ధొచ్చేలా"

"చాల్లె ధ్దూ. పెద్దదానివయ్యుండి కూడా యేమిటమ్మా నువ్వు. యేదో సర్దుకుపోవాలి గాని"

"అదేవిట్రా? నువ్వుకూడానూ?... అవున్లే-నేనంటే ఆఖరికి కన్నకొడుక్కి గూడా లోకువయిపోయాను...ఇక యీ యింట్లో నాకెవరున్నారని...నా ముద్దుల మనవడే నాయనమ్మను ఓకంట చూస్తాడు" అంటూ ఆమె ఇంట్లోకి చూస్తూ "ఒరేయ్ శేషూ...శేషూ" పిల్చింది.

"లేదండీ, బడికుర్రాళ్లతో కలిసి యెక్కడికో వెళ్లేడు" అని సుశీల సమాధానమిచ్చింది.

మజ్జిగ కొని తేవటానికి గాజుచెంబు తీసుకొని శర్మ మార్కెట్టుకి బయలుదేరేడు.

* * *

"అబ్బబ్బ! ఎప్పుడుచూసినా యింట్లో ఒకే గొడవలు ఇద్దరిలో యే ఒక్కరు కూడా సమాధానపడరుకదా! ఒకటే కోడిపుంజుల పోట్లాట. అయినా సుశీలకు బుద్ధివుండొద్దూ తల్లివంటి అత్తగారితో పోట్లాడుతుంది. అయినా సుశీలదేం తప్పు. "మా అత్తగారు మంచిది కాదమ్మా, చాలా కోపిష్ఠి" అంటూ ప్రబోధించిన తల్లిదండ్రులను కూడా లెక్కచెయ్యకుండా, తన అత్తగారింతో వుత్తమురాలని సమర్థించుకొని మరీ కాపురానికొచ్చింది! అత్తగారిని

తల్లితో సమానంగా చూచుకొంటున్నది కదా!

అయితే అమ్మ వూరికేనే తిడుతుందా! ఏదో వృద్ధాప్యంకదా అనుకొంటే, అందరూ అలానే వుంటారా? అబ్బ! కొంచెమైనా శాంతించదుకదా! అయినా మరి మొదట్లో యిద్దరూ తల్లికూతుళ్లులా అన్యోన్యంగా వుండేవారే! మరేమిటి యీ విచిత్రం. పోనుపోను యింకా అన్యోన్యంగా మెలగవలసిన



వాళ్లు యిలా జగడాలు కొనితెచ్చుకుంటున్నారుకదా! యిలావుంది కాలమహిమ! అత్తాకోడళ్ల సంసారాలు యిట్లాగే వుంటాయి కాబోలు" ననుకొంటూ శర్మ మార్కెట్టుకు చేరుకున్నాడు. ఒక అర్ధశేరు పెరుగు కొనుక్కొని యింటిదారి పట్టేడు.

* * *

శర్మ యింట్లో అడుగుపెట్టేసరికి వెనకాలే అతని కొడుకు శేషాద్రిరావు ప్రవేశించాడు. శర్మ వెనక్కు తిరిగిచూసి, శేషుతో—

"ఎక్కడకు వెళ్ళేవురా యింత సేపూను? రోడ్డుమీద కార్లూ, లారీలు తిరుగుతుంటాయికదా, దేనికిందయినా పడితేనో"

"ఏమిట్రా ఆ అపశకునపుమాటలూ, నువ్వూను. నువ్విలా రా నాయనా" అంటూ బామ్మగారు మనవణ్ణి దగ్గరకు తీసుకొంది.

"ఇదిగోనమ్మా, బజారునుంచి పెరుగు కొనితెచ్చాను" అంటూ శర్మ పెరుగు గిన్నెను తల్లి కందించాడు.

"అదేమిటి బామ్మా! అమ్మ రాత్రి పెరుగు తోడిపెట్టిందికదూ!" అంటూ శేషు బామ్మగారి నడిగాడు.

"చూడరా శేషూ! మీ అమ్మకు నేనంటే యెంత బీదరింపో. పెరు గెక్కువగా తోడిపెట్టేసి మజ్జిగనంతా పుల్లగా చేసేసింది. సరాసరి లాక్కుపోతున్నా యనుకో" అంటూ లాలనగా మనుమడికి సమాధానం చెప్పింది బామ్మ.

"అదికాదు బామ్మ! నేనే యెక్కువగా పెరుగు తోడిపెట్టేను"

"నువ్వేమిట్రా?" అంటూ ప్రశ్నించాడు శర్మ.

"కాదు నాన్నగారూ! బామ్మేమో... మరి అమ్మతో నిన్న రేపటికి స్పెషల్‌గా పెరుగును తోడుపెట్టమని చెప్పిందా! మరి అమ్మేమో అలా కాకుండా మామ్మూలుగా రోజూలాగే కొంచెం పెరుగు తోడుపెట్టింది. అలా అయితే బామ్మగారికి బాగోదనీ...నేనేమో మరి ...అమ్మ చూడకుండా యెక్కువగా పెరుగుపోసి తోడుపెట్టేనూ" అంటూ శేషు బామ్మగారి ప్రక్కకు చేరుకున్నాడు.

"ఆరి పిడుగా, నువ్వట్రా యీ పని చేసింది" అనుకున్నాడు శర్మ.

ఏచూశారా! నేనంటే నా మనవడికెంతప్రేమో! నాగురించి ప్రత్యేకం పెరుగెక్కువగా తోడిపెట్టేడు. కన్నకొడుకయినా చేశాడా? రారా శేషూ! పెరుగూ బువ్వ తిందాం" అంటూ బామ్మగారు మనవణ్ణి తీసుకొని యింట్లోకి వెళ్ళిపోయింది.

ఇదంతా చూస్తున్న సుశీల యిదొక క్రొత్తేమిటనుకున్నట్లుగా మూతి త్రిప్పుకుంటూ వంటగదిలో కెళ్లిపోయింది.

శర్మ మటుకు యేడవాలో, నవ్వాలో తెలీక అట్లాగే రాతిబొమ్మలా నిల్చుండిపోయాడు.

★